సాక్షి
రంగారెడ్డి

బుధవారం : 24 : మే : 2023



గన్నీ బ్యాగులు కోసం పడిగాపులు
సరిపడగా గన్నీ బ్యాగులు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజులుగా పడిగాపులుకాస్తున్నారు. 8లో▸



ఆవిరైన ఆనందం
ఆరుగురు స్నేహితులు ఫాంహౌస్‌లో దావత్ చేసుకున్నారు. రాత్రంతా ఆనందంగా గడిపారు. తెల్లారేసరికి వారి ఆనందం ఆవిరైంది. 8లో▸



84 గ్రామాల ప్రజలకు లబ్ధి
84 గ్రామాల ప్రజల మేలును దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ 111 జీవోను రద్దు చేశారని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ కె.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో టైలరింగ్, మగ్గం వర్క్స్, సెల్‌ఫోన్ రిపేరింగ్ కోర్సుల్లో నెల రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి పదో తరగతి పాసైన మహిళలు ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతోపాటు ఎస్ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతచేయాలన్నారు. శిక్షణకాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యంతో పాటు యూనిఫాం, టూల్ కిట్స్ ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు 86390 79122, 79819 51167, 90007 78300 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సివిల్స్‌లో మెరిసిన షాద్‌నగర్ ఆణిముత్యం

జాతీయ స్థాయిలో 384వ ర్యాంకు సాధించిన సుస్మిత



ఇప్పలపల్లి సుస్మిత

షాద్‌నగర్: దేశంలోనే అత్యున్నత సర్వీస్‌గా భావించే సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాల్లో జాతీయ స్థాయిలో షాద్‌నగర్ విద్యార్థిని సత్తా చాటింది. పట్టణానికి చెందిన ఇప్పలపల్లి శ్రీశైలం, లక్ష్మి దంపతుల కూతురు సుస్మిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 384 ర్యాంకు సాధించింది. గతంలో మూడుసార్లు ఇంటర్వ్యూకు చేరుకున్న ఆమె లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. పట్టువదలకుండా నాలుగోసారి శ్రమించి మంచి ర్యాంకు సాధించింది. ఆమె పదో తరగతి వరకు షాద్‌నగర్ పట్టణంలోని హెరిటేజ్ వ్యాలీలో చదివింది. అనంతరం హైదరాబాద్‌లోని పేజ్ కళాశాలలో ఇంటర్, అండర్ గ్రాడ్యుయేషన్‌ను వరంగల్‌లోని నిట్‌లో పూర్తి చేసింది. పబ్లిక్ సర్వీస్‌పై ఆసక్తి పెంచుకున్న ఆమె సివిల్స్‌కు సిద్ధమైంది. నాలుగో ప్రయత్నంలో లక్ష్యాన్ని చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు సుస్మితను ఘనంగా సన్మానించారు.

మాసబ్ చెరువు శిఖంలో మట్టి తొలగింపు షురూ



మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువులో మట్టి తొలగింపు పనులను ఎట్టకేలకు మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు ప్రారంభించారు. చెరువు శిఖం ప్రభుత్వ సర్వే నంబర్ 137లో నక్షబాట పేరుతో రైతుల ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్ద పెద్ద బండరాళ్లు, వందల కొద్ది టిప్పర్ల మట్టిని డంప్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై ‘సాక్షి’లో సోమవారం మాసబ్‌పై మాఫియా శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం మట్టి తొలగింపు పనులను ప్రారంభించినప్పటికీ అధికారులు ఏర్పాటు చేసిన జేసీబీతో పెద్ద పెద్ద బండరాళ్లను తొలగించడం సాధ్యంకాలేదు. దీంతో బుధవారం పెద్ద యంత్రాలను ఏర్పాటు చేసి తొలగింపు పనులు చేపడతామని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గతంలో సర్వే నంబర్ 205లో మట్టి డంప్ చేసిన సమయంలోనూ అధికారులు పలు కారణాలతో వాయిదా వేసి, సదరు వ్యక్తులకు కోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చే వరకు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి.

షూలో దాచి తెచ్చిన 1818 గ్రాముల బంగారం పట్టివేత



శంషాబాద్: అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రియాద్ నుంచి మంగళవారం మధ్యాహ్నం ఎక్స్‌వై 325 విమానంలో వచ్చిన ముగ్గురు ప్రయాణికుల కదలికలను అనుమానించిన అధికారులు వారిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లగేజీల్లో ఎలాంటి వస్తువులు దొరకలేదు. వారు ధరించిన షూలను విప్పిచూడగా పాదం భాగంలో పేస్టు రూపంలో అతికించిన ఉన్న బంగారం బయటపడింది. 1818 గ్రాముల బరువు కలిగిన బంగారం విలువ రూ.1.13 లక్షల విలువ ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితులు ముగ్గురు కూడా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు.

మళ్లీ ఇళ్ల స్థలాలు!

- 2014 ముందు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పట్టాల జారీ
- అప్పట్లో పట్టాలిచ్చి.. పొజిషన్ చూపని ప్రభుత్వం
- కొన్నిచోట్ల పొజిషన్ చూపినా కట్టుకోని లబ్ధిదారులు
- ఆయా భూములు స్వాధీనం
- తిరిగి కేటాయింపులకు సన్నాహాలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పేదలకు మళ్లీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెవెన్యూ అధికారులు ఆయా భూములను గుర్తించి, వాటిలో లే అవుట్ తయారు చేసి.. పాత లబ్ధిదారులతో పాటు కొత్తగా మరికొంత మందికి కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తొలుత మహేశ్వరం నియోజకవర్గంలో ఈ ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించారు.

అప్పట్లో వందల మందికి కేటాయింపు

2014కు ముందు ఉమ్మడి ఏపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించింది. మహేశ్వరం మండలంలోని మీర్‌పేట్, కందుకూరు, కడ్తాల్‌తో పాటు చేవెళ్ల నియోజకవర్గంలోని అజీజ్‌నగర్, తోల్‌కట్ట, శంకర్‌పల్లిలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని వినోబానగర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, కుంట్లూరు, బాటసింగారం, మునుగనూరు, వట్టినాగులపల్లి తదితర ప్రాంతాల్లోనూ ప్రభుత్వ, అసైన్డ్ భూములను పేదలకు పంచారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సుల్తాన్‌పల్లి, దావుద్‌గూడ.. ఇలా జిల్లా వ్యాప్తంగా 3,500 నుంచి 4000 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ స్థలాలు ఊరికి దూరంగా ఉండటం, ఎత్తుపల్లాల మధ్య ఉండటం, కరెంట్, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో చాలా మంది ఇల్లు నిర్మించుకోలేకపోయారు. ఒకటి రెండు గదులు నిర్మించిన వారు కూడా ఆ తర్వాత అక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆయా గదుల్లో ఉండలేక పోయారు.

ఒకే పని రెండు రకాలుగా లబ్ధి

పట్టాలు ఇచ్చిన తర్వాత ఆరు నెలల్లోనే పొజిషన్‌కు వెళ్లాలనే నిబంధన కూడా విధించారు. నిర్మాణ ఖర్చులకు డబ్బులు లేకపోవడం వారి పాలిట శాపంగా మారింది. ఇటీవల వీరిలో కొంత మంది ఆయా పట్టాలు తీసుకుని తమకు కేటాయించిన సర్వే నంబర్లలో ఇల్లు నిర్మించుకునేందుకు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అదేమంటే ఆరు నెలల్లోపే పొజిషన్‌లోకి వచ్చిన వారి పట్టాలు మాత్రమే చెల్లుబాటవుతాయని ప్రకటించారు. పోలీసు బందోబస్తు మధ్య ఆయా నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. పొజిషన్‌లో ఉన్న వారిని వదిలేసి.. లేనిచోట ఆయా ఖాళీ స్థలాల్లో మళ్లీ కొత్తగా లే అవుట్ చేసి, చేతిలో పట్టా కాగితాలున్న పాత లబ్ధిదారులతో పాటు కొత్త లబ్ధిదారులకు కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు పంచడం ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చడంతో పాటు మరో ఆరు నెలల్లో రాబోతున్న ఎన్నికల్లోనూ ఓట్ల రూపంలో లబ్ధిపొందొచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

58,59 జీవోల కింద భారీగా దరఖాస్తులు

ఒకవైపు పాత పట్టా దారులకు పొజిషన్ చూపించాలని సన్నాహాలు చేస్తూ.. మరోవైపు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారి నివాసాలను, వారి ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలా లను క్రమబద్ధీకరించేందుకు ఏర్పాట్లు చేసింది. గత ఆగస్టులో జీఓ నంబర్ 58,59లను జారీ చేసింది. తొలుత 2014 జూన్ 2గా ఉన్న కటాఫ్ డేట్‌ను 2020 జూన్ వరకు పొడిగించి మళ్లీ అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ రెండు జీఓల కింద 50 వేలకుపైగా దరఖాస్తులు అందాయి. ఈ నెలాఖరుతో దరఖాస్తు గడువు ముగియనుండటంతో మరిన్ని దరఖాస్తులు అందే అవకాశం లేకపోలేదు. ఇదిలా ఉంటే జిల్లా పరిధిలోని యూఎల్‌సీ భూముల్లోని 44 కాలనీల్లోని ఇళ్ల క్రమబద్ధీకరణకు 118 జీఓను జారీ చేసింది. ఈ జీఓ కింద ఇప్పటికే ఐదు వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 900 దరఖాస్తులు మినహా మిగిలిన వాటికి ఇప్పటికే పట్టాలు జారీ చేసింది. 58,59 జీవోల కింద ఇప్పటి వరకు ఐదు వేల ఇళ్లను క్రమబద్ధీకరించారు. దరఖాస్తుల పరిశీలన ఇంకా కొనసాగుతోంది. ఈ పథకంతో ఆక్రమణదారులకు లబ్ధి చేకూరడంతో పాటు ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం లేకపోలేదు.

ప్రజల ఆరోగ్య రక్షణకు కృషి చేయాలి



మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ హరీశ్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లా కలెక్టర్లు, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ.. జిల్లాకు 81 బస్తీ దవాఖానాలు మంజురయ్యాయని, వాటిలో 59 వినియోగంలోకి తేవడం జరిగిందని చెప్పారు. ఆరు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మరో 5 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. 71 పల్లె దవాఖానాలు మంజూరయ్యాయని 35 దవాఖానాలకు స్థలాలను గుర్తించి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, సంబంధిత విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రైతుల నుంచి హమాలీ వసూలు చేయొద్దు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం: రైతుల నుంచి హమాలీ వసూలు చేయొద్దని బీజేపీ జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని రాయపోల్, దండుమైలారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి హమాలీ చార్జీలను చెల్లిస్తున్నా కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీ చార్జీలను వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ధాన్యం తూకంలో మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. కల్లాల నుంచి తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సేకరించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొరెడ్డి నర్సింహారెడ్డి, కొత్త అశోక్‌గౌడ్, మర్పల్లి అంజయ్య, పొరెడ్డి అర్జున్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, తాళ్ల వెంకటేశ్‌గౌడ్, దొండ రమణారెడ్డి, దొండ విష్ణువర్ధన్‌రెడ్డి, గణేశ్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలశివుడు, సత్యనారాయణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న బొక్క నర్సింహారెడ్డి

మహిళా సమస్యలకు పరిష్కారం



సీడీఈడబ్ల్యూ సెంటర్ ప్రారంభోత్సవంలో డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ పురుషోత్తంరెడ్డి తదితరులు

మీర్‌పేట: పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహిళలకు ఎలాంటి సమస్య వచ్చినా సీడీఈడబ్ల్యూ (మహిళా సాధికారత అభివృద్ధి కేంద్రం)కి వచ్చి పరిష్కరించుకోవాలని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ సూచించారు. మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీడీఈడబ్ల్యూ కౌన్సెలింగ్ సెంటర్‌ను మంగళవారం ఆమె వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం కుటుంబంలో జరిగే చిన్న చిన్న గొడవలకు పోలీస్‌స్టేషన్ మెట్లెక్కి ఫిర్యాదు చేసి జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నారని, అలాంటి వారికి సీడీఈడబ్ల్యూ సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో శిక్షణ పొందిన కౌన్సిలర్, ఎగ్జిక్యూటివ్ ద్వారా మహిళలకు సంబంధించిన అన్ని సమస్యలపై కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐలు గోవిందస్వామి, బద్యానాయక్, ఉదయ్ భాస్కర్, రవికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమంపై దృష్టి సారించండి



కలెక్టర్ హరీశ్‌తో మాట్లాడుతున్న షెహజాదీ

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదీ

ఇబ్రహీంపట్నం రూరల్: మైనార్టీల సంక్షేమానికి ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదీ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమెకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హరీశ్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రధానమంత్రి 15 సూత్రాల పథకం అమలు తీరుపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో మైనార్టీల స్థితిగతులు, జనాభా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరుస్తున్న లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షాదీ ముబారక్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్హులైన వారికి మంజూరయ్యేలా చొరవ చూపాలని అన్నారు. వృత్తి నైపుణ్య శిక్షణ కోసం ఎక్కువ మందిని ఎంపిక చేస్తూ నాణ్యమైన శిక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అందిస్తున్న ఉచిత శిక్షణ కేంద్రాల్లో మైనార్టీ యువతులు ఎక్కువ సంఖ్యలో చేరేలా ప్రోత్సహించాలని, వారి కుటుంబీకులకు అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే మసీదు నిర్వహణ కమిటీల సహకారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్య, ఉపాధి రంగాలకు సంబంధించి విరివిగా రుణాలు అందజేయాలని తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నందున, అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని షెహజాదీ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఉపకార వేతనాల గురించి, వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మైనార్టీ రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, మహిళా శిశు సంక్షేమం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, బ్యాంకింగ్, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల ద్వారా మైనార్టీలకు అమలు చేస్తున్న కార్యక్రమాలు, వాటి ప్రగతి గురించి అధికారులు ఆమెకు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతీక్ జైన్, తిరుపతి రావు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆర్డీఓలు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్ రెడ్డి, జిల్లా గిరిజనాభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.

బీరు.. జోరు బేజారు

వేసవి కాలం చల్లని బీరు కిక్‌ని పెంచుతోంది. కొన్నేళ్లుగా వేసవి సీజన్‌లో అమాంతం పెరిగే బీర్ల విక్రయాలే దీనికి నిదర్శనం. ఆల్కహాల్ శాతం తక్కువ, ఆరోగ్యానికి హానికరం కాదు వంటి అపోహలతో అడపాదడపా రుచి చూసేవాళ్లు కూడా వేసవిలో బీర్‌బలులుగా మారిపోతున్నారు. ముఖ్యంగా యువత బీర్ల వినియోగాన్ని మంచినీళ్ల ప్రాయంగా భావిస్తుండడం కనిపిస్తోంది. బీరు చల్లదనాన్ని ఇవ్వడమనేది అపోహ మాత్రమేనని, ఈ వ్యసనం ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాలు చూపిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వేడి వాతావరణంలో మద్యపానం శారీరక విపత్తుగా మారుతుందని అంటున్నారు. వేడి వాతావరణం నేపథ్యంలో ఆల్కహాల్‌ను అత్యధికంగా తీసుకోవడంతో తీవ్రమైన ఆరోగ్య ఇబ్బందులు వస్తాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆల్కహాల్ అబ్యూజ్ అండ్ ఆల్కహాలిజం నివేదిక చెబుతోంది.

ఎండాకాలంలో భారీగా పెరిగిన వీటి విక్రయాలు

- తక్కువ ఆల్కహాల్ హానికరం కాదనేది అపోహ మాత్రమే
- ప్రతిరోజూ బీరు తీసుకోవడం ముప్పేనంటున్న వైద్యులు



సాక్షి, సిటీబ్యూరో: చెమట ద్వారా ఒంట్లోని నీటి శాతానికి వేసవి సీజన్‌లో తీవ్ర నష్టం కలుగుతుంది. మరోవైపు ఆల్కహాల్ వినియోగంతో సంభవించే అధిక మూత్ర విసర్జన ఈ నష్టాన్ని అధికం చేస్తుంది. శరీరం తీసుకునే దానికంటే ఎక్కువ నీటిని కోల్పోయినప్పుడు డీహైడ్రేషన్ పరిస్థితి ఏర్పడుతుంది. శరీర పనితీరుకు అవసరమైన సాధారణ ద్రవాల కొరతకు దారితీస్తుంది. దీంతో తీవ్రమైన నాలుక పిడచ కట్టుకుపోయేంత దాహం, పొడి నోరు, తలనొప్పి, మైకం, అలసట, గందరగోళానికి గురికావడం వంటివి ఎదురవుతాయి. ఆల్కహాల్ మూత్ర ఉత్పత్తిని పెంచుతుంది. అంతేకాక శరీరానికి ద్రవాలను నిలుపుకోవడం కష్టతరం చేస్తుంది. వేసవి వేడిలో ఆల్కహాల్ వినియోగించినప్పుడు, త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంది, శరీర అంతర్గత ఉష్ణోగ్రతను నియంత్రించే స్వాభావిక సామర్థ్యాన్ని ఆల్కహాల్ దెబ్బతీస్తుంది, శరీరపు అంతర్గత ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా పెరిగినప్పుడు సంభవించే తీవ్రమైన పరిస్థితి హీట్‌స్ట్రోక్. ఇది మెదడు, గుండె ఇతర అవయవాలకు హాని కలిగిస్తుంది. అధిక శరీర ఉష్ణోగ్రత, వేగవంతమైన హృదయ స్పందన, వికారం, వాంతులు, తలనొప్పి నుంచి మూర్ఛ వరకూ ఇది దారి తీసే ప్రమాదం ఉంది.

మానేయాలి లేదా బాగా తగ్గించాలి..

ఈ నేపథ్యంలో ఆల్కహాల్ వేసవి వేడిని కలపడం వల్ల కలిగే ప్రమాదాల నుంచి రక్షించుకోవడానికి హైడ్రేటెడ్‌గా ఉండడం చాలా అవసరం. రోజంతా పుష్కలంగా నీరు తాగడం చాలా అవసరం. అధిక వేడి, ఉక్కపోత, ఉష్ణోగ్రతలు ఉండే రోజులలో ఆల్కహాల్‌ను పూర్తిగా ఆపేయడం లేదా బాగా పరిమితం చేయడం మంచిది. బీరుతో పాటు నాన్ వెజ్ వంటకాలు అధికంగా తీసుకోవడం కూడా ద్రవం అడుగంటడానికి శరీరంలో వేడి విజృంభణకు దారితీస్తుంది.

ఏటా పెరుగుతున్న బీరు విక్రయాలు...

గత కొన్నేళ్లుగా మార్చి, ఏప్రిల్, నెలల్లో బీర్ల విక్రయాలు తారస్థాయికి చేరుకోవడం కనిపిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరు నుంచి మే మొదటి వారం వరకూ పది రోజుల పాటు వర్షాల కారణంగా వాతావరణం చల్లబడడంతో బీర్ల వినియోగం కూడా ఎప్పటికన్నా బాగా తగ్గిపోయింది. దాంతో ఈ సారి బీర్ల అమ్మకాల్లో తరుగుదల నమోదవుతుందని వైన్‌షాప్ యజమానులు భావించారు. 10 రోజులుగా ఒక్కసారిగా పెరిగిన ఎండలు మళ్లీ బీరు విక్రయాలు ఎగబాకాయి. కేవలం 2 వారాల విక్రయాలతోనే గత ఏడాది మే నెల సేల్స్‌ను అందుకోవడం తథ్యమని వ్యాపారులు చెబుతున్నారు.

వైద్యులేమంటున్నారు?

- 5 నుంచి 12 శాతం ఆల్కహాల్‌తో ఇతర ఆల్కహాలిక్ పానీయాల కంటే బీరు తక్కువ హానికరం. కొంత మొత్తంలో ఆల్కహాల్ కలిగి ఉందని అధికంగా తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది.
- ఆల్కహాల్‌లోని కేలరీలు ఆహారాల నుంచి వచ్చే కేలరీల కన్నా భిన్నంగా ఉండి, పొట్ట ఉబ్బడానికి దారితీస్తాయి
- అధిక మద్యపానం గుండె కండరాలను దెబ్బతీస్తుంది, స్ట్రోక్, అధిక రక్తపోటు, టైప్ 2 డయాబెటిస్ దడ ప్రమాదాన్ని పెంచుతుంది. ఆల్కహాల్ కంటెంట్ ఎక్కువగా ఉన్న బీరు తాగడం వల్ల హైపర్ టెన్షన్ కిడ్నీ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అధిక మూత్రవిసర్జనకు కారణమై బీరు మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. దీర్ఘకాలంలో మూత్రపిండాల్లో రాళ్లు లేదా మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుంది.
- రెగ్యులర్‌గా బీరు తాగడం వల్ల కొన్ని విటమిన్లు మినరల్స్ అవసరాలు శరీరానికి బాగా పెరుగుతాయి. ఈ అవసరాలు నెరవేరనప్పుడు, అది ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. బీరు తాగడం వల్ల త్వరగా నిద్రపోవడానికి సహాయపడుతుంది కానీ అది దీర్ఘ కాలం ఉండదు. ఇందులో గాఢ నిద్ర 90 నిమిషాలు మాత్రమే ఉంటుంది. ఇది పగటిపూట మగత, ఏకాగ్రత లోపం, అలసటకు దారితీస్తుంది.

అతివేగానికి ఆస్పత్రిపాలు

- రోడ్డు ప్రమాదంలో 21 మంది కూలీలకు గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- అందరూ ఒకే గ్రామానికి చెందిన వారు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో 21 మంది కూలీలు గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవి కుమార్ కథనం ప్రకారం.. యాచారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన 21 మంది కూలీలు మట్టి పనులు చేయడానికి మంగళవారం ఉదయం గ్రామం నుంచి బాలాపూర్ సమీపంలో ఉన్న మల్లాపూర్‌కు బొలెరో (టీఎస్ 07యుజీ 9106) వాహనంలో వెళ్తున్నారు. ఆదిబట్ల సమీపంలోని బీరప్పగుడి వద్దకు రాగానే వేగంగా వెళ్తున్న వాహనం రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న వారు ఎగిరి కిందపడిపోయారు. చుట్టు పక్కల వారు గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. గాయపడ్డ వారిలో వరికుప్పల విజయ, చిక్కుడు రాణి, కంభాలపల్లి గోపాల్, యాచారం చెన్నమ్మ, చిక్కుడు రాములు, కంబాలపల్లి నర్సింహ, కంబాలపల్లి శిరీష, శేఖర్‌రెడ్డి, కంబాలపల్లి జంగయ్య, సోములు సుజాత, సప్పిడి విజయ, కావలి రాణి, కొండాపురం స్వప్న, గుండ్లకుంట వరలక్ష్మి, యాచారం యాదయ్య, గండికోట రాణి, జస్వంత్ హస్తినాపురంలోని భృంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వరికుప్పల యాదయ్య, కృష్ణయ్య, కర్రె ప్రవీణ్, మర్రి వెంకటేశ్ బొంగ్లూర్ సమీపంలోని కొంతం మోహన్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడ్డ వారిలో విజయ, రాణి, గోపాల్ పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన వాహనం ఇదే..

84 గ్రామాల ప్రజలకు లబ్ధి: ఎమ్మెల్యే కాలె

జీఓ 111 రద్దుపై సర్వత్రా హర్షం

- ఎమ్మెల్యే యాదయ్యకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బాకారం సర్పంచ్ రాఘవరెడ్డి తదితరులు

మొయినాబాద్ రూరల్: చేవెళ్ల నియోజకవర్గంలోని 84 గ్రామాల ప్రజల మేలును దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ 111 జీవోను రద్దు చేశారని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. సీఎం నిర్ణయం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని బాకారంలో సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డితో కలిసి మంగళవారం శుభోదయ కార్యక్రమం ప్రారంభించారు. 111జీవో రద్దు చేసినందుకు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా కాలె యాదయ్య మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. ఈ జీవో రద్దు వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటు జరుగుతోందని, దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, గ్రామాలు మరింత అభివృద్ధి జరుగుతాయని ఆయన వివరించారు. దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాసంక్షేమమే తమ ప్రభుత్వం ధ్యేయమని తెలిపారు. అంతకుముందు గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభాలు, పురాతన వాటర్ ట్యాంకులను తొలగించాలని గ్రామస్తులు కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, ఎంపీడీఓ సంధ్య, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, బాకారం సర్పంచ్ రాఘవరెడ్డి, వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్ యాదవ్, ఎంపీటీసీ అర్జున్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోర శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆవిరైన ఆనందం

- రాత్రి ఫాంహౌస్‌లో దావత్ చేసుకున్న స్నేహితులు
- ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



సాజిద్ మృతదేహం



అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన బైక్

మొయినాబాద్: ఆరుగురు స్నేహితులు ఒక ఫాంహౌస్‌లో దావత్ చేసుకున్నారు. రాత్రంతా ఆనందంగా గడిపారు. అయితే.. తెల్లారేసరికి వారి ఆనందం ఆవిరైంది. ఉదయం ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన అబ్దుల్ సాజిద్(23) గచ్చిబౌలిలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం స్నేహితులు షఫీ, అఖిల్, షాకిర్, లియాఖత్, ఉస్మాన్‌లతో కలసి మొయినాబాద్ మండల పరిధిలోని రోజ్ ల్యాండ్ ఫాంహౌస్‌కు వెళ్లారు. అక్కడ దావత్ చేసుకున్నారు. రాత్రంతా ఫాంహౌస్‌లో గడిపి మంగళవారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరారు. సాజిద్, షఫీ బైక్‌పై వెళ్తుండగా.. మిగతావారు కారులో బయలుదేరారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మండల పరిధిలోని రాణే ఇంజన్ వాల్స్ కంపెనీ వద్దకు రాగానే మూలమలుపు వద్ద వీరి బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెనుక కారులో వస్తున్న స్నేహితులు గమనించి క్షతగాత్రులను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అబ్దుల్ సాజిద్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. షఫీ చికిత్స పొందుతున్నాడు. కొన్ని గంటల ముందు తమతో కలసిమెలసి ఉన్న సాజిద్ విగతజీవిగా ఉండటాన్ని చూసి స్నేహితులు తల్లడిల్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గన్నీ బ్యాగుల కోసం రైతుల పడిగాపులు



మోకిల కొనుగోలు కేంద్రం వద్ద గన్నీ సంచుల కోసం ఎగబడుతున్న రైతులు

శంకర్‌పల్లి: సరిపడా గన్నీ బ్యాగులు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని శంకర్‌పల్లి మండలం మోకిలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు రెండు రోజులుగా పడిగాపులుకాస్తున్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ రైతులతోపాటు రాయదుర్గం పీఏసీఎస్ పరిధిలోని జనవాడ, మియాఖాన్‌గడ్డ, మిర్జాగూడ గ్రామాల రైతులు తిండి తిప్పలు మాని సంచులకోసం ఎదురు చూస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గన్నీ సంచుల కొరత కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకురాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లాల్లోనే పంట ఉందని.. వర్షం వస్తే చేసినా కష్టం అంతా వృథా అవుతుందని వాపోయారు. అధికారులు స్పందించి ప్రతీ మండలంలో పీఏసీఎస్ పరిధిలో గన్నీ సంచులు అందించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద కనీసం తాగునీటి వసతి ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు.

15వేల బ్యాగులు అందించాం

మోకిల కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఇప్పటి వరకు 15వేల గన్నీ బ్యాగులను అందించాం. రైతులంతా ఒకేసారి పంట కోయడంతో బ్యాగుల కొరత ఏర్పడింది. ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం. రైతులకు సరిపడా బ్యాగులు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.
– సురేశ్ బాబు, మండల వ్యవసాయాధికారి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా పాండురంగారెడ్డి



పాండురంగారెడ్డిని సన్మానిస్తున్న ఎస్టీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సత్తు పాండురంగారెడ్డి నియమితులయ్యారు. నగరంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆయనకు నియమాకపత్రం అందజేశారు. మండల పరిధిలోని తులేకలాన్ గ్రామానికి చెందిన పాండురంగారెడ్డి యాచారం మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన పదవితో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి రాజమణి, పుట్టపాక ప్రవీణ్‌కుమార్, సుధాకర్, గోవర్ధన్‌రెడ్డి, శంకర్, కులకర్ణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం కోల్పోయి.. బావిలో పడి..

జీవన్‌గూడలో మహిళ మృతి



కాలమ్మ మృతదేహం

మొయినాబాద్: మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ బావిలో పడి మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని జీవన్‌గూడలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఎనికేపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం జీవన్‌గూడకు చెందిన కుమ్మరి కాలమ్మ(50) భర్త కృష్ణయ్య ఏడేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మతిస్థిమితం కోల్పోయింది. నాలుగేళ్ల పాటు ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందినా కోలుకోలేదు. అప్పటి నుంచి ఇంట్లోనే ఉండే కాలమ్మ అప్పుడప్పుడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రెండు మూడు రోజుల తర్వాత తిరిగి వచ్చేది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. గ్రామ సమీపంలో ఉన్న బావిలో పడి మృతి చెందింది. అటుగా వెళ్తున్నవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మొయినాబాద్: మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తా సమీపంలో ఉన్న వీజేఐటీ కళాశాల వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. వీజేఐటీ కళాశాల వద్ద మంగళవారం ఉదయం భిక్షాటన చేస్తూ జీవనం సాగించే గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. బట్టలు లేకుండా మృతదేహం పడిఉంది. ఎలాంటి ఆధారాలు దొరకలేదు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే మొయినాబాద్ పీఎస్‌లో, 9494420614, 9491039043 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

కత్తులతో బెదిరించి బైక్ చోరీకి యత్నం

ఇద్దరు నిందితుల రిమాండ్

శంకర్‌పల్లి: ఫైనాన్స్ వారమని యువకుడిని కత్తులతో బెదిరించి బైక్‌ను అపహరించేందుకు యత్నించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శంకర్‌పల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన పవన్‌జిత్ సింగ్ బీదర్‌లోని గురుద్వార్‌కు ప్రతి ఆదివారం బైక్‌పై వెళ్లి వస్తుంటాడు. సోమవారం తన ఇంట్లో అద్దెకుంటున్న తీరక్ సింగ్‌ను వెంట బెట్టుకొని వెళ్లాడు. తిరుగుప్రయాణంలో శంకర్‌పల్లి శివారులోకి రాగానే.. ఓ వివాహ వేడుకలో హాజరై తిరిగి వెళ్తున్న సంగారెడ్డి జిల్లా, కంగ్టి మండలం చేర్యాల గ్రామానికి చెందిన సాయికుమార్, నా గరాజును వీరిద్దరు అడ్డగించారు. తాము ఫైనాన్స్ వారమని, బైక్‌పై రుణం ఉందని, వెంటనే చెల్లించా లని నమ్మబలికారు. సాయికుమార్‌ను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లారు. మండలంలోని జనవాడ శివారులోకి వెళ్లగానే సాయికుమార్‌ను కత్తులతో బెదిరించి బైక్‌ను తీసుకొని పరారయ్యారు. సాయికుమార్ పెద్ద ఎత్తున కేకలు వేయడంతో స్థానికులు గమనించి పవన్‌జిత్ సింగ్, తీరక్ సింగ్‌లను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్‌లు, ఒక కత్తి స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. పవన్‌జిత్ సింగ్‌పై రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో హత్య, దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు.

గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయండి

ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేవెళ్ల: గుర్తింపు లేకుండా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలను వెంటనే రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, ఎ.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ప్రైవేట్ పాఠశాలల్లో అనుమతులు లేకుండానే అడ్మిషన్లు చేస్తున్నారని.. ఫైర్ సేఫ్టీ తదితర సౌకర్యాలు లేకుండానే పాఠశాలలు కొనసాగిస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి సదరు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలోనూ పాఠశాలలు ప్రారంభమైన వెంటనే సర్వే చేస్తామన్నారు. అధికారులు సైతం తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సార్.. అమ్మానాన్న కొడుతుండ్రు

పోలీసులను ఆశ్రయించిన బాలుడు



బాలుడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి

శంకర్‌పల్లి: ''సార్.. మా అమ్మానాన్న కొడుతుండ్రు.. నిత్యం నరకం చూపిస్తుండ్రు. వారిని శిక్షించండి''అంటూ ఓ బాలుడు మంగళవారం శంకర్‌పల్లి పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా మద్దూరుకు చెందిన మాల నర్సింహులు, లక్ష్మి దంపతులు శంకర్‌పల్లిలోని హనుమాన్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. రోజు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. లక్ష్మికి మొత్తం ఐదు మంది సంతానం. మొదటి భర్త కుమారుడైన రాము(11)ను ప్రతిరోజు కొట్టడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి భార్యాభర్తలను కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలుడిని మరోసారి కొడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'లక్ష్మీదేవిపల్లి'ని మీరెందుకు నిర్మించలేదు

- కాంగ్రెస్‌కు జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ ప్రశ్న
- 'పాలమూరు'కు జాతీయ హోదా కల్పించాల్సిన బాధ్యత బీజేపీదే

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్ల పాలనలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదని.. పదిసార్లు అవకాశమిచ్చిన ప్రజలకు వారేం చేశారో చెప్పాలని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ మాట్లాడుతూ.. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కాంగ్రెస్ హయాంలో ఎంత జరిగింది.. బీఆర్‌ఎస్ పాలనలో ఎంత చేశారో చూసేందుకు ప్రతిపక్షాలు వస్తే బస్సులో తీసుకెళ్తానని ఎమ్మెల్యే ప్రస్తావిస్తే.. దాన్ని ప్రతిపక్షాలు వక్రీకరించి మాట్లాడుతున్నాయన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మిస్తే ఈ ప్రాంతానికి సాగునీరు అందుతుందని నేటి వరకు ఏ ఒక్క పార్టీ ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నీటిని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాల్సిన బాధ్యత బీజేపీదేనన్నారు. జాతీయ హోదా కోసం కేంద్రాన్ని నిలదీయలేని బీజేపీ నాయకులు ఆందోళనలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు సీఎం కేసీఆర్‌పై, బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం, కొందుర్గు సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు మన్నె నారాయణయాదవ్, శ్రీధర్‌రెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, శ్రీశైలంగౌడ్, రామకృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

'మోడల్' విద్యార్థుల అమెరికా పర్యటన రద్దు



ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మహేశ్వరం: ముందస్తు అనుమతి తీసుకోక పోవడంతో ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌కు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం పర్యటన రద్దయింది. ఈ నెల 25 నుంచి 28 వరకు నాలుగు రోజులపాటు అమెరికాలోని టెక్సాస్‌లో నిర్వహించే కాన్ఫరెన్స్‌కు 9 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయుల బృందం మంగళవారం మధ్యాహ్నం బయలుదేరాల్సి ఉండగా.. వీరు విద్యాశాఖ, మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్లు, ఉన్నతాధికారుల అనుమతి తీసుకోలేదు. దీంతో వారి పర్యటన రద్దయింది. విషయం తెలుసుకున్న నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మోడల్ స్కూల్‌కు చేరకుని ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్‌ని ప్రశ్నించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అనుమతి తీసుకుని రీషెడ్యూల్ చేస్తామన్నారు. రూ.50వేలు అప్పుచేసి విద్యార్థులకు వీసా, దుస్తులు తదితర సామగ్రి కొనుగోలు చేశామని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.